క్లుప్తంగా

గర్భిణులు టీకాలు వేయించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న హెచ్ఈవో రవిదాస్

వాంకిడి: ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా పంపిణీ చేసే టీకాలను గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని ఆరోగ్య విస్తరణ అధికారి పెందుర్ రవిదాస్ సూచించారు. బుధవారం మండలంలోని ఇందాని గ్రామంలో టీకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టీకాల వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. తీవ్రమైన ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రథమచికిత్స విధానాన్ని వివరించారు. ఏఎన్ఎం కాంత, ఎంఎల్హెచ్పీ సుచరిత, ఆశలు గంగుబాయి, కమల తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ బోనాలు



బోనాలతో గౌడ కులస్తులు

తిర్యాణి: మండలంలోని గౌడ సంఘం ఆధ్వర్యంలో గత నెల 26 నుంచి నిర్వహిస్తున్న శ్రీ రేణుక ఎల్లమ్మ బోనాల జాతర బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా భక్తులు భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మ జమదాగ్ని మునిరాజు కల్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బైండ్ల వారి పాట, శివశక్తుల ఆటలతో ఊరంతా హోరెత్తించారు. కార్యక్రమానికి పెద్దఎత్తున మండల ప్రజలు, గౌడ కులస్తులు పాల్గొన్నారు.

గ్రామస్తుల శ్రమదానం



రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న గ్రామస్తులు

రెబ్బెన: గుంతలు పడిన రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోకపోవడంతో గ్రామస్తులే నడుం బిగించారు. శ్రమదానం చేసి రోడ్డుపై ఏర్పడిన గుంతను పూడ్చేశారు. గోలేటి విలేజ్లో హనుమాన్ ఆలయం నుంచి సేవాలాల్ ఆలయానికి వెళ్లే మార్గంలో రోడ్డు గుంతలమయంగా మారింది. వృద్ధులు, చిన్నారులతో పాటు రాత్రివేళల్లో రోడ్డుపై ప్రయాణించే వారికి గుంత ప్రమాదకరంగా మారడంతో రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ఎన్నోసార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించారు. అయినా పట్టించుకోకపోవటంతో గ్రామ సేవాలాల్ ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో బుధవారం గ్రామస్తులు శ్రమదానం చేసి రోడ్డుకు మరమ్మతులు చేసి గుంతలు పూడ్చారు.

వేసవికాలంలో అప్రమత్తంగా ఉండాలి



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న రాజ్కుమార్

చింతలమానెపల్లి: వేసవి కాలంలో వచ్చే జ్వరాలపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వైద్యాధికారి రాజ్కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని బాలాజీ అనుకోడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలోని 57 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. పలువురి నుంచి రక్తన మూనాలు సేకరించారు. గ్రామస్తులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారి రాజ్కుమార్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. వేసవి కాలంలో డీహైడ్రేషన్కు గురై నిస్సత్తువకు లోనవుతారని ఉప్పు, చక్కెర, నిమ్మరసం కలిపిన నీటిని తరచూ తీసుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్, హెల్త్ సూపర్వైజర్ ఇందిర, ఏఎన్ఎంలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపు ఇంటర్వ్యూలు

ఆసిఫాబాద్రూరల్: జిల్లాలో ఇంటర్మీడియెట్ పూర్తయిన పేద విద్యార్థుల కోసం ఉచిత డిగ్రీ సీటు ఇవ్వడంతో పాటు ఎంఎస్ఎన్ ల్యాబరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్లో ఉద్యోగం కల్పించడానికి ఈనెల 3వ తేదీన జిల్లా కేంద్రంలోని చైతన్య కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జీజేఎల్ జిల్లా అధ్యక్షుడు నవీన్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్లో ఎంపీసీ, బైపీసీలలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ధ్రువీకరణ పత్రాలతో శుక్రవారం ఉదయం 9 గంటలకు కళాశాలలో హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9440243777 లో సంప్రదించాలన్నారు.





భగ్గుమంటున్న సూరీడు..!





దహెగాం: భానుడు రోజురోజుకూ ఉగ్రరూపం దాల్చుతున్నాడు. మండలంలో 43 నుంచి 44 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి జంకుతున్నారు. వామ్మో ఇదేమి ఎండ అంటూ ఉదయం పది గంటలు దాటితే బయటకు రావడం లేదు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వస్తే నెత్తిన కొంగు, స్కార్ఫ్, నెత్తి మీద టోపీ, గొడుగు తప్పనిసరిగా మారాయి. ఎండ నుంచి ఉపశమనం పొందడానికి మార్కెట్లో వెలసిన జ్యూస్ సెంటర్ల వద్ద బారులు తీరుతున్నారు. నిమ్మ రసం, పండ్ల రసాలు తాగుతున్నారు.

ఘనంగా మేడే వేడుకలు

వాంకిడి: మండల కేంద్రంలో బుధవారం మేడే వేడుకలు భవన నిర్మాణ, హమాలీ కార్మికులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. హమాలీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు బి.సునీల్ కార్మిక జెండా ఎగురవేశారు. ఎంపీపీ ముండె విమలబాయి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పీఏసీఎస్ చైర్మన్ జబోరె పెంటు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుర్నులె నారాయణ, వ్యాపారవేత్తలు అవినాష్, అనిల్, అమ్జద్, నాయకులు అశోక్ మహోల్కర్, దీపక్ ముండె, గోపినాథ్, దుర్గం శ్యాంరావు, దుర్గ ప్రశాంత్, కార్మిక సంఘం నాయకులు డి.లాలు, సుధాకర్, నానాజీ, సోమయ్య, దౌలత్, ఆత్మరాం, సురేశ్, ధర్మ, తులసీరాం, మధుకర్ పాల్గొన్నారు.

దహెగాం: మండల కేంద్రంలో బుధవారం మేడేను సీఐటీయు ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల అధ్యక్షురాలు వజ్రమ్మ, కన్వీనర్ రమేశ్ల ఆధ్వర్యంలో కార్మిక దినోత్సవ సందర్భంగా జెండా ఎగురవేశారు. అంతకు ముందు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కార్మికులు జయ, ఈశ్వరీ, రవీందర్, అరుణ్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

పెంచికల్పేట్: మండల కేంద్రంలో మేడే సందర్భంగా బుధవారం సీఐటీయూ జెండా ఆవిష్కరించారు. అనంతరం కార్మికులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రభుత్వ కంపెనీలను ప్రైవేటీకరణ చేస్తూ కార్మికులు పొట్టకొడుతుందని అన్నారు. రానున్న రోజుల్లో కార్మికులు ఏకమై హక్కుల సాధనకు పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కౌటాల: మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో మండల సీఐటీయూ నాయకులు, కార్మికులు బుధవారం 138వ మేడే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. సీఐటీయూ కార్యాలయం ఎదుట సీఐటీయూ నాయకులు, కార్మికులు జెండా ఎగురవేశారు. వారు మాట్లాడుతూ అమెరికాలోని చికాగో నగరంలో 8 గంటల పనివిధానం కోసం పోరాడి అమరులైన కార్మికులను గుర్తుచేసుకుంటూ ఏటా మేడే జరుపుకుంటున్నామన్నారు. సీఐటీయూ నాయకులు జాడి మోరేశ్వర్, మోర్లె నగేశ్, నాయకులు విఠల్, జనార్దన్, ప్రశాంత్, అనిల్, తిరుపతి, కాంతరావు, విలాస్, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని విజయనగర గ్రామంలో ఏటా మే డే వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు. మేడే పురస్కరించుకొని గ్రామంలోని చర్చిలో ప్రత్యేక పూజలు చేశారు.



దహెగాం: సీఐటీయూ ఆధ్వర్యంలో జెండా ఎగురవేస్తున్న నాయకులు

జైనూర్: కార్మికుల చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని గ్రామీణ పేదల సంఘం జిల్లా అధ్యక్షుడు కుటికెల శంకర్ అన్నారు. బుధవారం మేడే దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో కార్మికుల జెండా ఆవిష్కరించారు.

చింతలమానెపల్లి: మండలంలో బుధవారం మేడే వేడుకలు నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో పలు కార్మిక సంఘాల నాయకులు కార్మిక దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. కార్మిక దినోత్సవం సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల సీఐటీయూ కన్వీనర్ విలాస్, ఉపాధ్యక్షుడు రవి, శ్యాంరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని బొగ్గు గనులు, ఇతర డిపార్టుమెంట్లలో బుధవారం 138వ కార్మిక దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఏరియాలోని ఖైరిగూడ ఓసీపీలో ఏఐటీయూసీ జెండా వద్ద సీనియర్ నాయకులు సత్యనారాయణ, టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్రావులు ఎర్రజెండాలు ఎగురవేసి కార్మిక అమరవీరులకు నివాళి అర్పించారు. గోలేటి టౌన్షిప్లోని హెచ్ఎంఎస్ కార్యాలయం వద్ద ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు, కేఎల్ మహేంద్రభవన్లో బ్రాంచి ఆర్గనైజింగ్ కార్యదర్శి శేషు, సివిల్ కార్యాలయం వద్ద జగ్గయ్య, గోలేటి సీహెచ్పీలో ఎంబడి రామయ్య, గోలేటి ఎక్స్రోడ్ వద్ద సింగరేణి కోల్ ట్రాన్స్పోర్టు డ్రైవర్స్ అసోషియేషన్ నాయకులు ఎర్రజెండాలు ఎగురవేశారు. ఏఐటీయూసీ నాయకులు శ్రీనివాస్, అంజయ్య, షకీల్, ఓదెలు, నర్సయ్య, శ్రీనివాస్, రాజయ్య పాల్గొన్నారు.

తిర్యాణి: మండల కేంద్రంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీనియర్ కార్మిక నాయకుడు రంగు లచ్చుగౌడ్ జెండా ఆవిష్కరించారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సింగం మొగలిగౌడ్ మాట్లాడుతూ ఎన్నో త్యాగాలు, పోరాటాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను యధావిధిగా కొనసాగించాలన్నారు.

కౌటాల/కాగజ్నగర్రూరల్: కాగజ్నగర్ పట్టణంలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో పలుచోట్ల జెండా ఆవిష్కరణలు చేసి ర్యాలీ నిర్వహించారు.



పెంచికల్పేట్: జెండా ఆవిష్కరిస్తున్న కార్మికులు



వాంకిడి: నివాళులర్పిస్తున్న నాయకులు



ఖైరిగూడ ఓసీపీలో జెండా ఎగురవేస్తున్న నాయకులు



కౌటాల: జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



జైనూర్: జెండా ఆవిష్కరిస్తున్న కార్మికులు



చింతలమానెపల్లిలో..



తిర్యాణి: నినాదాలు చేస్తున్న నాయకులు

ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలి



ప్రవచనాలు చెబుతున్న ప్రేమ్సింగ్ మహరాజ్

బెజ్జూర్: ప్రతిఒక్కరూ భక్తి సన్మార్గంలో నడవాలని లంబాడాల (బంజారా) ఆరాధ్య దైవం సేవాలాల్ మహరాజ్ దీక్షగురువు సంత్ శ్రీ తపస్వి శ్రీశ్రీశ్రీ ప్రేమ్సింగ్ మహరాజ్ అన్నారు. మండలంలోని లంబాడిగూడలో సేవాలాల్ మహరాజ్ జగదంబ దేవాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బంజారా సంస్కృతి, సాంప్రదాయం ప్రకారం భోగ్భండార్ నిర్వహించారు. అనంతరం బంజారాల సమక్షంలో లంబాడిగూడకు ప్రేమ్నగర్గా నామకరణం చేశారు. గ్రామస్తులు మోతిరామ్ మహరాజ్, దుప్పనాయక్, కేసునాయక్, చత్రు నాయక్, వసంత్ నాయక్, భిక్షపతి, మంజి నాయక్, సంతోష్నాయక్, కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం

పెంచికల్పేట్: మండలంలోని మురళీగూడ, కమ్మర్గాం, అగర్గూడ గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలను గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు సముద్రాల రాజన్న, చౌదరి తిరుపతి, సాజిద్, ఉపాసీ సంజీవ్, పొర్తెటి మధునయ్య, ఈశ్వరిబాయి, బాపు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభ విజయవంతం చేయాలి

ఆసిఫాబాద్రూరల్: జిల్లా కేంద్రంలో నేడు నిర్వహించనున్న సీఎం రేవంత్ రెడ్డి సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చరణ్ అన్నారు. బుధవారం మండలంలోని మోతుగూడ, బూర్గుడ, రాజుర, పర్సనంబాల గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాయకులు వినోద్, మహేష్, గోపాల్, పోచ్చయ్య, దాము, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: కాంగ్రెస్తోనే అభివృద్ధి సాధ్యమని పార్టీ నాయకులు సుజాయత్ ఖాన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని వివిధ వాడల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో అయూబ్ఖాన్, రహీం, తదితరులు ఉన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ చేసిందేమీ లేదు

• ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

నార్నూర్: బీజేపీ, కాంగ్రెస్లు ప్రజలకు చేసిందేమీ లేదని పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్తో కలిసి ఆమె బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార ర్యాలీలో పాల్గొన్నారు. గాంధీచౌక్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో 200 మంది వివిధ పార్టీల కార్యకర్తలు ఆమె సమక్షంలో బీఆర్ఎస్లో చేరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేటికీ అమలు చేయడం లేదన్నారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కుకు భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

కౌటాల: బీఆర్ఎస్తోనే అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందుతారని ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. బుధవారం మండలంలోని కుంబారీ గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాయకులు పోచయ్య, శంకర్, బండు, గోవింద్రావు, వెంకటేశ్, మంగేశ్, ప్రశాంత్, లక్ష్మణ్ ఉన్నారు. బీఆర్ఎస్తోనే అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందుతారని జిల్లా నాయకులు నక్క శంకర్ అన్నారు. మండలంలోని కుంబారీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పోచయ్య, బండు, గోవింద్రావు, వెంకటేశ్, మంగేశ్, ప్రశాంత్, లక్ష్మణ్ ఉన్నారు.



ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, రాథోడ్ జనార్దన్

కొనసాగుతున్న రాజకీయ పార్టీల ప్రచారం..

రెబ్బెన: ఎంపీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ప్రచారంలో భాగంగా బుధవారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు గోలేటి రిజర్వాయర్లో పని చేస్తున్న ఉపాధిహామీ కూలీలను కలిసి కారు గుర్తుకు ఓటు చేసి బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉపాధిహామీ కూలీలు పని చేసే ప్రదేశాలకు వెళ్లి ఓట్లు అడిగారు. గంగాపూర్లో సైతం ప్రచారం నిర్వహించారు. మాజీ సర్పంచ్ పోటు సుమలత, మాజీ జెడ్పీటీసీ అజ్మీర బాబురావు, నాయకులు శంకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఈవీఎంల గోదాం పరిశీలన



గోదాంను పరిశీలిస్తున్న వెంకటేశ్ దోత్రె

ఆసిఫాబాద్అర్బన్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు భద్రపర్చిన జిల్లా కేంద్రంలో గోదాంను బుధవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రె పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల కోసం నియోజకవర్గానికి వంద చొప్పున బ్యాలెట్ యూనిట్లు, కంట్రోలింగ్ యూనిట్లు, వీవీప్యాట్లు అవసరం ఉందన్నారు. గోదాంలో భద్రపర్చిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల మొదటి విడత పరిశీలన పూర్తి చేసి పార్లమెంట్ ఎన్నికల్లో ఉపయోగిస్తామని పేర్కొన్నారు. గోదాం వద్ద భద్రత చర్యల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ దాసరి వేణు, ఆర్డీవో లోకేశ్వర్రావు, ఎన్నికల సూపరింటెండెంట్ మధుకర్, నాయబ్ తహసీల్దార్ జితేందర్ తదితరులు ఉన్నారు.

జోరుగా బీజేపీ నాయకుల ప్రచారం



వాకింగ్ చేస్తున్న నగేశ్, పాల్వాయి హరీశ్బాబు

కౌటాల/కాగజ్నగర్రూరల్: పట్టణంలోని ఎస్పీఎం మైదానంలో బుధవారం ఉదయం బీజేపీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్బాబుతో కలిసి మార్నింగ్ వాక్ చేశారు. ఆయన వాకర్స్తో మాట్లాడారు. కమలం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు ఉన్నారు.

ఆసిఫాబాద్రూరల్: లోక్సభ ఎన్నికల ప్రచారాన్ని బీజేపీ నాయకులు జోరుగా కొనసాగిస్తున్నారు. బుధవారం జెడ్పీటీసీ నాగేశ్వర్రావు, విశాల్ అంకుసాపూర్, భీంపూర్, గోవింద్ పూర్, సాలేగూడ గ్రామాల్లో ప్రచారం సాగించారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ బీజేపీకి ఓటు వేసి కేంద్రంలో మోదీ ప్రభుత్వాన్ని తీసుకురావాలన్నారు. గ్రామాల్లో బీజేపీతోనే మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పలువురికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు విశాల్, నరేశ్, లక్ష్మి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

స్టేడియం కాదు.. చెరువు



దహెగాం: వర్షాభావ పరిస్థితులు, ఎండల తీవ్రతతో చెరువులు నీరు లేక పూర్తిగా ఎండిపోతున్నాయి. మండల కేంద్రం సమీపంలో ఉన్న చింతపాటి చెరువులో చుక్క నీరు లేదు. దీంతో క్రీడా మైదానాన్ని తలపిస్తుంది. మేతకు వెళ్లిన మూగజీవాలు నీరు లేక దాహం తీర్చుకోలేని పరిస్థితిల్లో ఇబ్బందులు పడుతున్నాయి. చెరువులు, వాగులు ఎండిపోవడంతో పాటు భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి.

'మూడు రోజుల్లో డబ్బులు ఇవ్వాలి'

కెరమెరి: ఉపాధిహామీ పథకంలో పనులు చేస్తున్న కూలీలకు మూడు రోజుల్లోనే కూలీ డబ్బులు అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఉపాధి హామీ పథకం జాయింట్ కమిషనర్ నర్సింహులు అన్నారు. బుధవారం ఆయన కెరమెరిలో డీఆర్డీవో సురేందర్తో పాటు స్థానిక ఈజీఎస్ ఏపీవోలు మల్లయ్యలతో కలిసి ఉపాధిహామీ అధికారులతో మాట్లాడారు. కూలీరేటు పెంచిన నేపథ్యంలో ప్రతీ రోజు కూలీకి కనీసం రూ.250 తగ్గకూడదన్నారు. కూలీలకు సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.



స్వాగతం పలుకుతున్న అధికారులు

రిటైర్డ్ ఆర్మీ జవాన్లకు సన్మానం

కౌటాల/కాగజ్నగర్రూరల్: కాగజ్నగర్ మండలం విలేజ్ నంబర్ 5, 12 కాలనీలకు చెందిన జవాన్లు హవాల్దార్ గోకుల్ మిస్త్రీ, హవాల్దార్ ధనుంజయ్ సర్కార్లు ఇటీవల రిటైర్ కాగా బుధవారం కాగజ్నగర్ పట్టణంలోని రైల్వేస్టేషన్లో రిటైర్డ్ ఆర్మీ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. రిటైర్మెంట్ అనంతరం కాగజ్నగర్ రైల్వేస్టేషన్కు చేరుకున్న జవాన్లకు ఘనస్వాగతం పలికారు. అసోసియేషన్ అధ్యక్షుడు శివ నాయర్, సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



రిటైర్డ్ ఆర్మీ జవాన్లను సన్మానిస్తున్న సభ్యులు